# సాక్షి శ్రీకాకుళం

శనివారం : 28 : జూన్ : 2025






## అడ్డగోలు నిల్వలకు..

ఇసుక పోగులు విద్యుత్ తీగలను తాకుతున్నాయి. ఎవరూ పట్టించుకోవడం లేదు.

- 8లో



## ప్రాణం తీసిన సిగరెట్ అలవాటు

ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. సిగరెట్ అలవాటే అతడి ప్రాణం తీసింది.

- 8లో

## నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటల నుంచి స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా తెలియజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా ప్రజాప్రతినిధులతో పాటు జెడ్పీటీసీలు, ఉమ్మడి జిల్లా అధికారులు హాజరుకానున్నారని తెలియజేశారు.

## న్యూస్‌రీల్

### 'మా భూములు మాకు కావాలి'



తమ భూములు ఆక్రమించారని చెబుతున్న గిరిజనులు

మందస: మందస మండలం చీపి పంచాయతీ పద్మపురం గ్రామంలో గిరిజనులు 60 ఏళ్లుగా భూములు సాగు చేస్తున్నారని, ఆ భూములపై లోన్లు కూడా తీసుకున్నారని, ఇప్పుడు ఆ భూములను పెత్తందారులు ఆక్రమించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తమ సర్వే నంబర్లపై వేరే పేర్లు చూపిస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్వో ఆఫీస్‌కు శుక్రవారం వెళ్లగా ఈ భూములపై సర్వేయర్‌ను పంపించి సర్వే చేయిస్తామని చెప్పారని గిరిజనులు తెలిపారు. తమ భూములు తమకు ఇప్పించాలని కోరారు.

### జిల్లా జైలు సందర్శన



ఆహార నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం క్రైమ్ : గార మండల పరిధి అంపోలులో ఉన్న జిల్లా జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా శుక్రవారం సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ (అమరావతి ) ఆదేశాల మేరకు ఖైదీల సత్ప్రవర్తన, వారి పెట్టుకున్న బెయిల్ పిటిషన్ దరఖాస్తులను పరిశీలించారు. ఖైదీలకు పెట్టే ఆహార నాణ్యతను పరిశీలించి పరిసర ప్రాంతాలను సందర్శించి జైలు అధికారులకు సూచనలందించారు.

**సబ్‌జైల్‌లో సేవలపై జిల్లా జడ్జి ఆరా**

నరసన్నపేట: స్థానిక సబ్‌జైల్‌ను జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. జైలులో ప్రభుత్వ నిబంధనల మేరకు సేవలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఆహార పదార్థాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సామరస్యంగా మెలగాలని, వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. దురలవాట్లకు బానిసలు కావద్దని అన్నారు. ఉచిత న్యాయవాది అవసరం ఉంటే ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.వాణి, సబ్ జైల్ సూపరింటెండెంట్ వినయ్ తదితరులు ఉన్నారు.

### పత్తిలో అంతర పంటల సాగుపై అవగాహన

కొత్తూరు: పత్తిలో అంతర పంటల సాగుపై ప్రకృతి వ్యవసాయం రీజనల్ యూనిట్ సభ్యులు హేమసుందరరావు, ప్రకాశరావులతో పాటు పలువురు అవగాహన కల్పించారు. మండలంలోని బాడ్రగూడ గిరిజన గ్రామంలో నవధాన్యాల సాగును శుక్రవారం పరిశీలించారు.





బొందిలీపురంలో ఉత్సవమూర్తులు



టెక్కలి : జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భక్తుల సందడి

శ్రీకాకుళం బొందిలీపురంలో రథంపై ఊరేగుతున్న స్వామి వారు



కాశీబుగ్గ: పలాసరైల్వేస్టేషన్ రోడ్డులో జగన్నాథుడి రథాన్ని లాగుతున్న భక్తులు

## కదిలినాడు చూడరో..

అన్న, చెల్లెలితో కలిసి దేవదేవుడు గర్భగుడి నుంచి బయటకు వచ్చాడు. జగన్నాథుడితో పాటు బలభద్రుడు, సుభద్రలు రథమెక్కి గుండిచాకు పయనమయ్యారు. ప్రజమంతా జయ జగన్నాథ అంటూ స్మరిస్తుండగా భక్త జనం రథం తాళ్లను ప్రేమతో లాగుతుండగా యాత్ర వైభవోపేతంగా సాగింది. జిల్లావ్యాప్తంగా జగన్నాథ రథయాత్ర మహోత్సవం కన్నుల పండువలా జరిగింది.

# పోలీస్ బదిలీల్లో చెల్లని సిఫార్సులు

## కూటమి నేతలకు శృంగభంగం!

- సిఫార్సులకు ప్రాధాన్యత ఇవ్వలేదని నాయకుల్లో ఆవేదన
- 220 మంది బదిలీల్లో చెప్పిన వారికి జరగలేదని ఆక్రోశం
- కీలక నేత దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం
- ఓ అధికారిని పిలిచి క్లాస్ పీకినట్టు ప్రచారం
- బదిలీలపై నెలకొన్న అనుమానాలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పోలీసుల బదిలీల్లో నేతల పప్పులుడకలేదు. వారి మాట చెల్లలేదు. ఒక్కో నేత తమ లెటర్ హెడ్ ద్వారా పోస్టింగ్‌ల కోసం రికమెండ్ చేశారు. ఎవరికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలనేది నాయకులే డిసైడ్ చేశారు. లిఖిత పూర్వకంగా అధికారులకు రాసి పంపించారు. కానీ వారు సూచించిన విధంగా బదిలీలు జరగలేదు. వారి సిఫార్సులకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. దీంతో పరువు పోయిందని నేతలంతా లబోదిబోమంటున్నారు. చివరికి కానిస్టేబుళ్లకు కూడా పోస్టింగ్ ఇప్పించలేకపోయామని ఆవేదన చెందుతున్నారు. అవమానకరమని జిల్లా కీలక నేత దృష్టికి ఆ నాయకులంతా తీసుకెళ్లారు. సంబంధిత అధికారిని ఒకరిని పిలుపించుకుని ఆ కీలక నేత క్లాస్ పీకినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇటీవల చేసిన బదిలీలు అమల్లోకి వస్తాయా? మళ్లీ ఏమైనా మారుతాయా? అన్న దానిపై సందేహం నెలకొంది.

**ఈ పదవులెందుకంటూ ఆవేదన...**

పోలీసుల బదిలీలపై నేతలు గుర్రుగా ఉన్నారు. సిఫార్సులకు ప్రాధాన్యత ఇవ్వలేదని ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో ఇటీవల 220 మందికి బదిలీలు జరిగాయి. 19 మంది ఏఎస్‌ఐలకు, 53 మంది హెడ్ కానిస్టేబుళ్లకు, 148 మంది కానిస్టేబుళ్లను బదిలీలు చేశారు. ఈ ప్రక్రియకు ముందు ఆ పోలీసుల్లో చాలా మంది నేతల సిఫార్సు లేఖలు తీసుకున్నారు. కావాల్సిన పోస్టింగ్ కోసం నాయకుల ద్వారా రికమెండ్ చేయించుకున్నారు. సిఫార్సుల కోసం పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్టు ఆరోపణలు ఉన్నాయి. పోలీసుల అవసరాన్ని నాయకులు క్యాష్ చేసుకున్నట్టు తెలిసింది. దీంతో ఒక్కసారిగా సిఫార్సుల తాకిడి ఎక్కువైంది. ఆ లేఖలు వచ్చి పడటంతో అధికారులు సైతం ఆశ్చర్యపోయినట్టు తెలిసింది. కోరుకున్న ప్లేస్ ఇవ్వాలంటే కష్టమన్న అభిప్రాయానికి వచ్చేసి ఉన్నతాధికారుల సూచనల మేరకు బదిలీ కసరత్తు పూర్తి చేసినట్టు తెలిసింది. సిఫార్సులకు పెద్ద పీట వేయకుండా పరిస్థితులకు తగ్గట్టుగా, పనితీరు ఆధారంగా బదిలీలు చేసినట్టు సమాచారం. ఇది నాయకులకు రుచించ లేదు. పోలీసు అధికారులపై మండిపడిపోతున్నారు. కానిస్టేబుళ్ల పోస్టింగ్‌లు కూడా వేయించుకోలేకపోతే ఇంకెందుకు పదవులని ఆవేదనకు లోనైనట్టు తెలిసింది.

### గట్టిగా క్లాస్ పీకారా..?

సిఫార్సులకు ప్రాధాన్యత ఇవ్వలేదని, ఏకపక్షంగా బదిలీలు చేశారని, రాజకీయ నాయకులకు విలువ లేకపోతే ఎలా అని సదరు నాయకులంతా జిల్లా కీలక నేత దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. జరిగినదంతా పూసగుచ్చినట్లు వివరించారు. అంతేకాకుండా ప్రస్తుతం పోలీసు శాఖలో పనిచేస్తున్న ఓ సామాజిక వర్గ క్షేత్ర స్థాయి అధికారులు కూడా నాయకులకు మద్దతుగా కీలక నేతకు బ్రీఫ్ చేసినట్టు తెలిసింది. ఎవరు చెప్పినా జరగలేదని, కనీసం పట్టించుకోలేదని కీలక నేతకు నూరిపోసినట్టు సమాచారం. సమాచారమంతా తెలుసుకుని సదరు కీలక నేత రియాక్ట్ అయ్యారు. గురువారం రాత్రి ఒక పోలీసు అధికారిని పిలిపించుకుని ఇలా అయితే ఎలా అని కాస్త గట్టిగా క్లాస్ పీకినట్టు చర్చ జరుగుతోంది. ఆ సమయంలో సదరు అధికారి ఏదో చెప్పడానికి ప్రయత్నించినా వినలేదని తెలిసింది. నాయకులు చెప్పింది చేయాల్సిందే అని హుకుం జారీ చేసినట్టు తెలియవచ్చింది. దీంతో ఇటీవల జరిగిన బదిలీలపై సందేహాలు కమ్ముకున్నాయి. ఆ నేత ఆదేశాల మేరకు బదిలీలపై పునరాలోచన చేస్తారేమో అన్న చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో ఏం జరుగుతుందో వేచి చూడాలి. అంతేకాదు నాయకులు చెప్పినట్టు జరగకపోవడంతో ఆ అధికారిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అన్న అనుమానాలు కూడా ఉన్నాయి.

# పలాసలో కార్మిక హక్కులకు భంగం



పారిశుద్ధ్య కార్మికుల నిరసన ర్యాలీ ముందుకు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

కాశీబుగ్గ: తమ సమస్యల పరిష్కారం కోసం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేపడుతున్న నిరసనను శుక్రవారం ఉదయం పోలీసులు అడ్డుకున్నారు. నిరసన, ర్యాలీ చేసేందుకు వీలు లేదని పోలీసులు చెప్పడంతో పోలీసులు, పారిశుద్ధ్య కార్మికుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెయ్యిల గణపతి, యూనియన్ నాయకులు సీహెచ్ మురగన్, కె.వెంకట్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేని పోలీస్ నిబంధనలు పలాసలోనే అమలు చేస్తూ ప్రజల హక్కులను పోలీసులు హరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు పోలీసులను పంపించి నిరసన జరగనివ్వకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.కూర్మారావు, ఎం.రవి, పి.బాలకృష్ణ, కె.ఈశ్వరరావు, ఎస్.తిరుపతి, ఢిల్లీ, ప్రకాష్ ముఖి, ఎస్.శంకర్, ఎస్.లక్ష్మి, ఉషా, గులాబీ, ఎస్.రమేష్ పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## 'యూజ్‌లెస్ ఫెలో గెటవుట్'

- తెలుగు యువత అధ్యక్షుడికి అవమానం
- భగ్గుమంటున్న టీడీపీ కార్యకర్తలు

జలుమూరు: యూజ్‌లెస్.. ఫెలో గెటవుట్ అని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి తనయ బగ్గు అర్చన తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడును అన్న మాటలు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. వీటిని సోషల్‌మీడియాలో ఆ పార్టీ కార్యకర్త పెట్టి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం జలుమూరు మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి కూడా పాల్గొన్నారు. ఇందులో భాగంగా జలుమూరులోని ఓ కల్యాణ మండపంలో ఓ వైపు సమావేశం జరుగుతుండగా స్టేజ్‌పైన ఉన్న దాసునాయుడు వద్దకు వెళ్లిన అర్చన యూజ్‌లెస్ ఫెలో గెట్‌అవుట్ అనడంతో ఒక్కసారిగా కంగుతున్న దాసునాయుడు వెంటనే స్టేజ్ దిగి వెళ్లిపోయారు. వెంటనే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కలుగజేసుకుని ఏం మాట్లాడుతున్నావంటూ మందలించారు. దీంతో అటు మింగలేక ఇటు కక్కలేక టీడీపీ కార్యకర్తలు అంతా మిన్నకుండిపోయారు.

## బ్యారేజీ నిర్వహణలో అశ్రద్ధ వద్దు



హిరమండలం ఎడమ ప్రధాన కాలువ హెడ్ రెగ్యులేటరీని పరిశీలిస్తున్న వంశధార అధికారులు

హిరమండలం: గొట్టా బ్యారేజీ నిర్వహణ విషయంలో అశ్రద్ధ వద్దని వంశధార ప్రాజెక్టు నరసన్నపేట ఈఈ ఎంఏ సీతారామనాయుడు అన్నారు. శుక్రవారం గొట్టా బ్యారేజీతో పాటు ఎడమ ప్రధాన కాలువ హెడ్ రెగ్యులేటరీని పరిశీలించారు. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల నుంచి నదిలో నీరు బ్యారేజీలో చేరుతున్నందున నీటిని స్థిరీకరించాలన్నారు. ఖరీఫ్‌నకు ఎలాంటి నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గొట్టా బ్యారేజీ కంట్రోల్ రూమ్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. డీఈ సరస్వతి, ఏఈ ధనుంజయరావు, పరిశుద్ధబాబు, భాను తదితరులు పాల్గొన్నారు.

# అబీమానం లేదా..?



- ఉచిత పంటల బీమాకు స్వస్తి పలికిన కూటమి ప్రభుత్వం
- ఖరీఫ్ పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలంటూ ఆదేశాలు
- జిల్లా వ్యాప్తంగా 3.62 లక్షల మంది రైతులపై రూ. 7.59 కోట్ల బారం
- గత ప్రభుత్వంలో ఉచితంగా పంటల బీమా అమలు




నరసన్నపేట:

అన్నదాతకు అందించే సాయంపై ప్రభుత్వం కోతలు విధించుకుంటూ పోతోంది. రైతులు పంట నష్టపోతే బీమా ఆదుకునేలా గత ప్రభుత్వం వారికి అండగా ఉంటూ ఐదేళ్లు బీమా మొత్తాన్ని తానే చెల్లించింది. ఫలితంగా ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోతే రైతులకు నష్టపరిహారం వచ్చేది. కానీ కూటమి ప్రభుత్వం బీమా భారం రైతులపైనే వేసింది. బీమా కావాల్సిన రైతులు వారే తమ పంటలకు బీమా చేయించుకోవాలని, అవసరమైన ప్రీమియం మొత్తం రైతులే చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు గత రబీ నుంచి అమలులోనికి వచ్చాయి. బ్యాంకుల్లో క్రాప్‌లోను వాడుకున్న రైతుల పేరున బ్యాంకర్లే ఈ మొత్తాన్ని కట్టి రైతుల ఖాతాలకు అప్పు మొత్తానికి జమ చేస్తారు. లోను వాడుకోని రైతులైతే మాత్రం మీ సేవా కేంద్రాలకు వెళ్లి క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలి. ఈ మేరకు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. ప్రతి ఎకరాకు వరి పంటలకు అయితే రూ. 160లు, మొక్కజొన్నకు అయితే రూ. 66 లు చెల్లించాలని సూచిస్తున్నారు. వరికి అయితే ఆగస్టు 15 లోగా, మొక్కజొన్నకు అయితే జూలై 31 లోగా ఇన్సూరెన్స్ చెల్లించాల్సి ఉంటుంది.

**జిల్లా రైతులపై రూ. 7.59 కోట్లు భారం**

జిల్లా వ్యాప్తంగా 3.62 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరు 4.74 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పుడు వీరందరిపైనా బీమా భారం పడుతుంది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా కింద ప్రభుత్వం జిల్లాలో రెండు పంటలను నోటిఫై చేసింది. వీటిలో వరి, మొక్కజొన్న పంటలు ఉన్నాయి. దీంతో ఈ రెండు పంటలకు బీమా పొందే అవకాశం రైతులకు ఉంది. వరి పంటకు ఎకరాకు రూ. 160, మొక్కజొన్నకు రూ. ఎకరాకు రూ. 66 చెల్లించాలి. ఈ విధంగా జిల్లా రైతులపై ఈ ఖరీఫ్‌కు సుమారుగా రూ. 7.59 కోట్లు రైతులపై భారం పడుతుంది

**రైతుల ఆవేదన..**

కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాను రద్దు చేయడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ పెట్టుబడులు భారీగా పెరిగాయి. ఎరువులు, కూలి రేట్లు, దుక్కి, దమ్ము, ఆకుతీత, ఉభాలు, కలుపు నివారణ, కోత వంటి పనులకు రేట్లు మారాయి. ఇవే రైతులకు భారంగా ఉంటున్నాయి. దీనికి తోడు ఈ ఏడాది నుంచి రైతులపై బీమా భారం కూడా పడటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ దశలో ప్రభుత్వ నిర్ణయం సరికాదని రైతులు అంటున్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా రైతుల తరపున సంబంధిత బీమా సంస్థలకు ప్రీ మియం చెల్లించాలని కోరుతున్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు. మళ్లీ క్రాప్ ఇన్స్యూరెన్స్ భారం అధికమవుతోందని రైతులు వాపోతున్నారు.

### బీమా భారం తగదు



ఇప్పటికే రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పండిన పంటలకు సరైన మద్దతు ధర లేదు. మరో వైపు పంట ఖర్చులు భారీగా పెరిగాయి. ఈ దశలో ప్రభుత్వాలు ఆదుకోవాలే తప్ప ఈ విధంగా తిరిగి భారం మోపడం సరికాదు. రైతులకు వ్యవసాయ సీజనులో ప్రతి రూపాయి ఎంతో అవసరం. ఆచి తూచి ఖర్చు చేస్తుంటారు. దీన్ని ప్రభుత్వాలు గమనించి రైతులపై భారం పడకుండా చూడాలి.

– బార్ల వేణుగోపాలరావు, రైతు, చెన్నాపురం

### ప్రభుత్వమే చెల్లించాలి



గత ప్రభుత్వం క్రాప్ ఇన్స్యూరెన్స్ భారం రైతులపై పడకుండా ప్రీమియం మొత్తం చెల్లించింది. ఈ విధంగా కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించాలి. ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేయడం సరైన చర్య కాదు. ప్రభుత్వం పునరాలోచించి రైతులపై భారం పడకుండా చూడాలి.

– చింతల వెంకటరావు, రైతు, లుకలాం

# పట్టాలపై మృత్యు ఘంటిక

- రైలు నుంచి జారిపడి యువకుడు మృతి
- ఆగస్టులో పెళ్లి ముహూర్తం
- అక్కవరంలో విషాదఛాయలు



బందాపు హరికృష్ణ (ఫైల్)

కాశీబుగ్గ :

కుటుంబమంతా పెళ్లి సందడిలో ఉన్న వేళ వరుడి చావు కబురు శోకం నింపింది. ఆగస్టులో వివాహం జరగాల్సిన యువకుడిని పట్టాలపై మృత్యువు మింగేసింది. కుటుంబ సభ్యులు, పలాస జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి మండలం అక్కవరం గ్రామానికి చెందిన బందాపు హరికృష్ణ(26) నౌపడ రైల్వేస్టేషన్ వద్ద రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. ఇతడు రైల్వేలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. విశాఖపట్నం నుంచి పలాసకు తరచూ రాకపోకలు సాగిస్తుంటాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి సూపర్‌ఫాస్ట్ రైలు ఎక్కి పలాస బయలుదేరాడు. నౌపడ రైల్వేస్టేషన్ వద్ద హాల్ట్ లేకపోవడంతో బండి నెమ్మదిగా కదులుతున్న వేళ దిగిపోదామని ప్రయత్నించి మరోవైపు ఉన్న పట్టాలపై గెంతాడు. కానీ ప్రమాదవశాత్తు జారిపోవడంతో కాలు రైలు కిందకు వెళ్లిపోయి తెగిపోయింది. అర్ధరాత్రి వేళ అతడు బాధతో విలవిలాడిపోయాడు. నీరు కావాలని గట్టిగా కేకలు వేసి నా నిర్మానుష్య ప్రదేశం కావడంతో ఎవరూ అతడిని గుర్తించలేదు. దీంతో అతడు తనకు కాబోయే భార్యకు ఫోన్‌లో సమాచారం అందించడంతో.. కుటుంబ సభ్యులకు విషయం తెలిసింది. వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు నొప్పితో విలవిలలాడిన హరికృష్ణ అక్కడే ప్రాణాలు వదిలేశాడు.

పలాస జీఆర్పీ ఎస్ఐ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ యువకుడు ఇలా రైలు ఆపని వేళ బలవంతంగా దిగిపోవడం మొదటిసారి కాదని, ఇదివరకు కూడా ఇలా చేయగా హెచ్చరించామని స్థానిక రైల్వే సిబ్బంది చెబుతున్నారు. అందుకే రైలు నుంచి ఫ్లాట్ ఫాం వైపు దిగకుండా వెనుక వైపు దిగాడని, కానీ ఆ పట్టాలపై గూడ్సు రైలు ఉండడంతో అనుకోని రీతిలో ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. మృతుడు హరికృష్ణ తండ్రి లచ్చయ్య పిడుగుపాటుతో చాలా ఏళ్ల కిందట మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి దాలమ్మ కూలి పనులు చేసుకుని ఇద్దరు కుమార్తెలకు వివాహం చేసింది. ఒక్కగానొక్క కొడుక్కి ఆగస్టు 13న వివాహం చేయడానికి నిశ్చయించారు. కానీ విధి వక్రీకరించడంతో ఆ కుటుంబమంతా విషాదంలో మునిగిపోయింది.

## క్లుప్తంగా

### పీఎం-ఉషా నిధులతో మౌలిక వసతులు



సమావేశానికి హాజరైన వీసీ కె.ఆర్.రజిని

ఎచ్చెర్ల: ప్రధాన మంత్రి ఉచ్చతర శిక్ష అభియాన్ (పీఎం-ఉషా) నిధులను పూర్తి స్థాయిలో ఉన్నత విద్యాభివృద్ధికి, మౌలిక వసతులు కల్పనకు వినియోగించాలని న్యూఢిల్లీకి చెందిన సంబంధిత అధికారి ఎస్.కె భర్నహాల్ సూచించారు. పీఎం ఉషా పథకానికి ఎంపికైన యూనివర్శిటీల వైస్ చాన్సలర్లు, అధికారులతో శుక్రవారం వర్చువల్ విధానంలో సమావేశం నిర్వహించారు. బోధన, పరిశోధన, నూతన నిర్మాణాలు, లేబొరేటరీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, క్రీడా మైదానాలు ఏర్పాటు వంటివాటికి ప్రాధాన్యమివ్వాలన్నారు. నిర్దేశిత సమయంలో నిధులు సద్వినియోగం చేసుకోకపోతే తదుపరి విడత నిధులు విడుదల కావన్నారు. వైస్ చాన్సలర్ కె.ఆర్ రజినీ మాట్లాడుతూ రెండో విడతలో పీఎం ఉషాకు అర్హత సాధించిన దేశంలోని 12 వర్శిటీల్లో అంబేడ్కర్ యూనివర్సిటీ ఒకటని పేర్కొన్నారు. నిధులు వినియోగానికి ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సమావేశంలో రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి గేట్‌లో 241వ ర్యాంక్



విద్యార్థిని అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ అధికారులు

ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ సీఎస్ఈ విద్యార్థిని కొమరాల శ్వేతశ్రీ గేట్‌లో 241వ ర్యాంకు సాధించడం అభినందనీయమని డైరెక్టర్ బాలాజీ అన్నారు. ఈ మేరకు విద్యార్థిని శుక్రవారం అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కుమార్తె మంచి ర్యాంకు సాధించడంపై పల్నాడు జిల్లా దుగ్గి గ్రామానికి చెందిన శ్వేతశ్రీ తల్లిదండ్రులు ఆదినారాయణ, అరుణ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, వెల్ఫేర్ అధికారి గేదెల రవి, మోహన్‌కృష్ణ చౌదరి, ఇన్‌చార్జి సాగర్, అధ్యాపకులు కోడా దిలీప్‌కుమార్, నూకేశ్వరరావు, గణేష్ మళ్లా, తేజకిరణ్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



ఉపకరణాలు పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగులను అన్ని విధాలా ఆదుకుంటామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్లో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సామాజిక బాధ్యత కింద నిర్వహించిన 802 మంది దివ్యాంగులకు రూ.3.20 కోట్ల విలువైన 1230 పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్ట్ అథారిటి ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అలీంకో సంస్థ సహకారంతో జనవరిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ భవిష్యత్తులో 40 నుంచి 60 శాతం ఉన్న దివ్యాంగులకు కూడా బ్యాటరీ సైకిళ్లు అందజేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, ఉపకరణాల కోసం సుమారు 1500 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నా 802 మందికే పంపిణీ చేయడంతో మిగిలిన వారు నిరాశ చెందారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, పౌర విమానయాన సంస్థ చైర్మన్ విపిన్‌కుమార్, హెచ్ఆర్ మెంబర్ హెచ్.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ సంజయ్ సింగ్, ఇండియా ట్రస్ట్ పింక్ సంస్థ ఫౌండర్ ఆనంద్‌కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, డీసీసీబీ చైర్మన్ ఎస్.సూర్యం, వంశధార చైర్మన్ అరవింద్, రిటైర్డ్ ఆర్డీఓ పీఎంజే బాబు తదితరులు పాల్గొన్నారు.




# అడ్డగోలు నిల్వలకు.. అడ్డు లేకుండా!

- కొత్తవలస సమీపంలో విద్యుత్ తీగలను తాకుతున్న ఇసుక పోగులు
- అడ్డుగా ఉంటున్నాయని ఏకంగా విద్యుత్ స్తంభాల మార్పు!
- ఆమదాలవలసలో చెలరేగిపోతున్న ఇసుకాసురులు

ఆమదాలవలస రూరల్: కూటమి ప్రభుత్వం వచ్చాక ఆమదాలవలస నియోజకవర్గంలో ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. ఉచిత ఇసుక విధానం పేరిట ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో తమకు అడ్డుగా ఉన్న దేన్నైనా పక్కకు తరలించేస్తున్నారు. ఈ క్రమంలో ఆమదాలవలస మండలం కొత్తవలస-పాతూరు గ్రామాల మధ్య ఇసుక నిల్వలు పోగు చేసేందుకు ఏకంగావిద్యుత్ స్తంభాలను మార్పు చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లే వ్యవహరిస్తున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా..**

ఇక్కడి నాగావళి నదీతీరం నుంచి అక్రమంగా ఇసుక తరలించేందుకు కొత్తవలస గ్రామానికి సమీపంలో పంట పొలాల్లో ఇసుక నిల్వలు డంపింగ్ చేస్తున్నారు. ఈ నిల్వలకు విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయనే కారణంగా కొందరు నాయకులు తమ పలుకుబడి ఉపయోగించి రక్షిత మంచినీటి పథకాలను నీరందించే 11 కె.వి.విద్యుత్ స్తంభాలను తరలింపు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొర్లకోట, చీమలవలస రక్షిత మంచినీటి



ఆమదాలవలస మండలం కొత్తవలసలో అడ్డగోలుగా పక్కకు తరలించిన 11 కె.వి.విద్యుత్ పోల్స్ ఇవే

పథకాలతో పాటు ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో ఉండే వెంకయ్యపేట రక్షిత మంచినీటి పథకాలకు నీరందించేందుకు నాగావళి నదిలో రెండు పంపుహౌస్‌లు ఏర్పాటు చేశారు. వీటికి తొగరాం విద్యుత్ ఉపకేంద్రం నుంచి విద్యుత్ లైన్ వెళ్తుంది. అయితే కొత్తవలస ప్రాంతంలో ఇసుక నిల్వలకు అడ్డుగా ఉన్నాయనే సుమారు నాలుగు నుంచి ఆరు విద్యుత్ స్తంభాలను నాగావళి నది గట్టుకు తరలించారు. వాస్తవంగా ఏదైనా ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉంటే మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటే విద్యుత్ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి రూ.40 వేలు నుంచి రూ.60 వేలు వరకు డి.డి.స్వీకరించి ఆ తర్వాతే విద్యుత్ స్తంభాలు తొలగిస్తుంటారు. ఇక్కడ మాత్రం ఆ నిబంధనలేవీ అమలుకాలేదు. ఇసుక మాఫియా రంగంలోకి దిగి రూపాయి ఖర్చులేకుండా రైతులను బెదిరించి మరీ కొత్తగా విద్యుత్ స్తంభాలను వేయించినట్లు తెలుస్తోంది.

**సమాచారమిచ్చాం..**

కొత్తవలస గ్రామంలో అక్రమ ఇసుక నిల్వలు విద్యుత్ తీగలను తాగుతున్న విషయమై ఆమదాలవలస విద్యుత్ శాఖ రూరల్ ఏఈ రవికుమార్ వద్ద ప్రస్తావించగా 'ఇసుక నిల్వల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని సంబంధిత ఇసుక తవ్వకందారులకు చెప్పాం. ఇసుక నిల్వల కోసం 11 కె.వి.విద్యుత్ స్తంభాలు పక్కకు తరలించడం అనేది ఏమీ లేదు. కొత్తగా లైన్ వేశాం అంతే..' అని సమాధానమిచ్చారు.

**విద్యుత్ తీగలను తాకుతూ..**

కొత్తవలస -పాతూరు మధ్య అక్రమ ఇసుక నిల్వలు 11 కె.వి.విద్యుత్ తీగలను తాకేంతగా పేరుకుపోయాయి. దీనివల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడటమే కాకుండా ఇసుక లోడింగ్ చేసేటప్పుడు ప్రమాదాలు సంభవించే అవకాశం కూడా ఉంది. ఇటీవల ఇసుక నిల్వలు మీదుగా వెళ్లిన మూడు నాలుగు మూగజీవాలు మరణించిన సంఘటనలు కూడా ఉన్నాయి.



కొత్తవలసలో విద్యుత్ తీగలను తాకేంత ఎత్తులో ఉన్న ఇసుక పోగులు

**నీటి సరఫరాకు అంతరాయం**



నదిలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు

నాగావళి నదిలో వెంకయ్యపేట, కొర్లకోట, చీమలవలస గ్రామల రక్షిత మంచినీటి పథకాలకు తరచూ విద్యుత్ అంతరాయం తప్పడం లేదు. ఇసుక నిల్వలు విద్యుత్ తీగలను తాకటమే కాకుండా తరలించిన విద్యుత్ స్తంభాలు తోటలకు ఆనుకొని వేయటంతో వర్షం వస్తే ఎప్పటికప్పుడు సరఫరా నిలిచిపోతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు తాగునీరు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. దీనికితోడు నాగావళి నదిలో నిబంధనలకు మించిన లోతులో ఇసుక తవ్వకాలు చేయటంతో భవిష్యత్తులో రక్షిత పథకాలకు నీరందే పరిస్థితి ఉండదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



విద్యుత్ సరఫరా సమస్యలతో తరచూ మొరాయిస్తున్న చీమలవలస రక్షిత మంచినీటి పథకం

**తవ్వకాలతో ఇబ్బందులు..**



ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాల వల్ల వెంకయ్యపేట వద్ద ఉన్న రక్షిత మంచినీటి పథకానికి నీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డుకట్టు వేసి విద్యుత్ అంతరాయం లేకండా చూడాలి. లేనిపక్షంలో ఆందోళన తప్పదు.

–దుంపల శ్యామలరావు, వైఎస్సార్ సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు, ఆమదాలవలస

## రెడ్‌క్రాస్ ద్వారా విస్తృత సేవలు



కలెక్టర్‌ను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ నిర్వాహకులు



సత్కారం అందుకున్న యోగ సాధకులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా విస్తృత సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశం, అవార్డుల ప్రదానోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో గత ఏడాది విజయవాడలో వరదలు వచ్చినప్పుడు రెండు ట్రక్కుల వస్తువులను పంపించి ఆదుకున్నట్లు గుర్తుచేశారు. రెడ్‌క్రాస్ ద్వారా సేకరించిన రక్తం అవసరమైన వారికి అందిస్తున్నారని, ఇటీవల తలసేమియా పేషెంట్ల కోసం కేంద్రం ఏర్పాటు చేసి అక్కడే రక్తం ఎక్కించే కార్యక్రమం జరుగుతోందన్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ వచ్చే నెల 9న జిల్లా కలెక్టర్ అవార్డు అందుకోబోతున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ ద్వారా గత ఏడాది చేసిన సేవలను వివరించారు. రక్తదానానికి సహకరించిన వివిధ స్వచ్ఛంద సంస్థలు, జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలను సన్మానించారు. అంతకుముందు ఫొటో ప్రదర్శనను తిలకించారు. ఇటీవల యోగాంధ్రలో పాల్గొన్న లయన్స్ క్లబ్ యోగాంధ్ర ఇన్‌స్ట్రక్టర్లు, ఆయుష్ అధికారి డాక్టర్ జగదీష్, డాక్టర్ ఉత్తమ్ రాజు, డాక్టర్ సునీల్, డాక్టర్ మోహనరావు, జె.చంద్రశేఖర్, ఆయుష్ సిబ్బంది, యోగాచార్యులు పాండ్రంకి మురళీకృష్ణ, తంగి స్వాతి తదితరులను సత్కరించారు. అనంతరం కలెక్టర్‌ను రెడ్‌క్రాస్ తరపున సన్మానించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ కె.సుధీర్, ట్రెజరర్ కె.దుర్గారావు, ఏజీఎం పరిశీలకులు, పార్వతీపురం మన్యం జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మెన్ డాక్టర్ ఎం.శ్రీరాములు, పెంకి చైతన్యకుమార్, కె.సత్యనారాయణ, రమణ, ఆర్ట్స్ సంస్థ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

### లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలపాలైన సింహాచలం

కంచిలి: మండలంలోని అంపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. కంచిలి మండలం కర్తలి గ్రామానికి చెందిన మూలి సింహాచలం కత్తివరంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి సైకిల్‌పై వస్తుండగా ఫ్లై ఓవర్ డౌన్‌లో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన యువకుడ్ని అంబులెన్స్‌లో సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. యువకుడి పరిస్థితి విషమించడంతో బరంపురం ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ పి.అప్పిరెడ్డి తెలిపారు.

### సామూహిక లలితా సహస్ర నామ పారాయణం



జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో శృంగేరి ఉభయ జగద్గురువుల అనుగ్రహంతో మైసూరుకు చెందిన సంతోష్‌కుమార్ ఘనాపాఠి 'శ్రీశంకర విజయం'పై చెబుతున్న ప్రవచనాలు శుక్రవారంతో ముగిశాయి. ముందుగా మహిళలు లలితా సహస్రనామ పారాయణ చేశారు. అహం బ్రహ్మాస్మి సీఈఓ పి.ఎ. మురళి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో పెంట రామచంద్రశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

## ఎట్టకేలకు ఆలయ భూమికి విముక్తి

సాక్షి ఎఫెక్ట్

అరసవల్లి: విలువైన ఆదిత్యుని భూమిని 'వాస్తు' నెపంతో తమ స్థలంలోకి కలిపేసుకోవాలన్న ఓ స్థల యజమానికి ఆలయ అధికారులు చెక్ పెట్టారు. స్థానిక గ్రామదేవత అసిరితల్లి గుడికి ఎదురుగా ఉన్న అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి చెందిన భూమిలో కొంత భాగాన్ని ఆక్రమించి భారీ నిర్మాణానికి తలపెట్టిన సంగతిని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 20న 'ఆలయ భూముల్లో అక్రమార్కులు' అనే కథనాన్ని ప్రచురించడంతో అధికారులు స్పందించారు. సదరు యజమానికి చెందిన హక్కు పత్రాలను పరిశీలించి ఆలయ భూముల్లోకి రాకుండా చెక్‌పెట్టారు. స్థానికంగా రాజీ యత్నాలు చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఆలయ భూమిని వదిలేసి తన హక్కుదారి స్థలంలోనే పిల్లర్లు వేసుకుని ఎర్త్‌ఫిల్లింగ్ పనులు చేపట్టారు. అయితే తూర్పు భాగంలో మాత్రం కొంత ఆలయ భూమి ఆక్రమణకు గురైనట్లుగా స్థానికులు చెబుతున్నారు. దీనిపై కూడా ఫిర్యాదులు చేసినప్పటికీ..ఆలయానికి చెందిన కొందరు అధికారిక ఉద్యోగులు చేతివాటం కారణంగా స్థల యజమానికి మద్దతుగా పనులు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే తూర్పు భాగంలో కొంత మేరకు ఆలయానికి చెందిన స్థలం ఆక్రమణకు గురైందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కూడా ఆలయ అధికారులు స్పందిచాలని కోరుతున్నారు. దీనిపై ఆలయ ఈవో కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్ వద్ద ప్రస్తావించగా..ఆలయ భూమిని ఒక్కసెంటు కూడా వదులుకోబోమని..ఇందులో ఆలయ ఉద్యోగుల పాత్ర ఉంటే క్షమించేది లేదని స్పష్టం చేశారు.



ఆలయ భూమిని వదిలేసి స్థలాన్ని ఎత్తు చేయించుకుంటున్న దృశ్యం

## ప్రాణం తీసిన సిగరెట్ అలవాటు

- విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి
- మడపాం టోల్‌గేట్ సమీపంలో ఘటన



రమేష్(ఫైల్)

నరసన్నపేట: మడపాం టోల్ గేట్ సమీపంలో గురువారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతిచెందగా..మరొకరు గాయపడ్డారు. కుటుంబ సభ్యులు, స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకొండపేట కు చెందిన పాలకొండ రమేష్(24) డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. గురువారం రాత్రి స్నేహితుడు బమ్మిడి గణేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై మడపాం టోల్‌గేట్ వద్దకు వెళాడు. అక్కడున్న గాయిత్రి టీ షాపులో టీ తాగారు. రాత్రి 11.30 సమయంలో సిగరెట్ తాగేందుకు మూసి ఉన్న షాపు వెనుక భాగం బాత్‌రూమ్ పైకి ఎక్కారు. అక్కడ 11 కె.వి. విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనలో రమేష్ అక్కడికక్కడే మృతి చెందగా.. గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చేతికి అందివచ్చిన కుమారుడు మృత్యువాత పడటంతో రమేష్ తల్లిదండ్రులు అప్పన్న, పార్వతి, సోదరుడు సంతోష్ కన్నీరుమున్నీరుగా విలపించారు. సిగరెట్ అలవాటు ప్రాణం మీదకు తెచ్చిందని స్థానికులు అంటున్నారు. విషయం తెలుసుకున్న నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తండ్రి అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశారు.



ప్రమాదానికి కారణమైన విద్యుత్ తీగలు

### ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల : యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఎచ్చెర్లలో సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టలేషన్ కోర్సులో వచ్చే నెల 4 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎస్. రామ్‌జీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా చెందిన యువకులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించనున్నామని, మరిన్ని వివరాలకు 9553410809, 79933 40407 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## ఓహెచ్..తూచ్!

- పాఠశాలలకు సెలవు విషయంలో గందరగోళం
- రాత్రి వేళ ఆదేశాలు రావడంతో ఇబ్బందులు

శ్రీకాకుళం: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం గందరగోళం నెలకొంది. ఆప్షనల్ హాలిడే(ఓహెచ్)ను గురువారం రాత్రి వేళ రద్దు చేయడమే దీనికి కారణం. వివరాల్లోకి వెళితే.. విద్యాశాఖ ప్రతి సంవత్సరం పాఠశాలల పని దినాలకు సంబంధించిన ముందుగానే క్యాలెండర్‌ను విడుదల చేయడం పరిపాటి. ఈ ఏడాది ఐదు రోజులు ఆప్షనల్ హాలిడే ఇచ్చుకునే సౌలభ్యం కల్పించారు. దీని ప్రకారం స్థానిక పండుగలు, ప్రత్యేక రోజుల్లో ఆ సెలవులను పాఠశాల స్థాయిలోనే ప్రకటించుకునే వీలుంటుంది.

శుక్రవారం రథయాత్ర ప్రారంభం కావడంతో జిల్లాలోని పాఠశాలలకు ఆప్షనల్ సెలవు ప్రకటించారు. ఈ మేరకు గురువారం సాయంత్రమే విద్యార్థులకు సెలవు సర్క్యులర్ పంపించారు. ఉపాధ్యాయులు కూడా నిబంధనలు మేరకు యాప్‌లో ఓహెచ్‌గా నమోదు చేసేశారు. అయితే గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఓహెచ్‌ను రద్దు చేస్తున్నట్లు జిల్లాకు వర్తమానం పంపించారు. దీంతో శుక్రవారం ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లినప్పటికి, అప్పటికే ఓహెచ్ నమోదు కావడంతో బయోమెట్రిక్ హాజరు వేయలేకపోయారు. విద్యార్థులకు సెలవు అని చెప్పడంతో వారెవరు పాఠశాలకు రాలేదు. పాఠశాల సమీపంలోని విద్యార్థులకు కబురు పంపించి రప్పించినప్పటికి సమీప గ్రామాల్లోని విద్యార్థులు మాత్రం హాజరు కాలేదు. సెలవు అని చెప్పడంతో వంట కార్మికులు కూడా రాకపోవడంతో వారిని అప్పటికప్పుడు పిలిపించి వంట చేయించాల్సి వచ్చింది. ఇది ఇలా ఉంటే జూలై 5న మొహరం సందర్భంగా ఆప్షనల్ హాలీడేను ప్రకటించారు. ఆ రోజున ప్రభుత్వం పేరెంట్స్ డే నిర్వహించాలని ఆదేశించడంతో ఆ నాటి ఆప్షనల్ హాలీడే కూడా రద్దు అయినట్టే. దీంతో రెండు సెలవులు కోల్పోయామని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




## గుమ్మగెడ్డ అభివృద్ధి కలేనా?



సీది సమీపంలో పూడికతో నిండిన గుమ్మగెడ్డ

- రెండు వేల ఎకరాలకు అందని సాగునీరు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- పట్టించుకోని పాలకులు

పాతపట్నం: ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు వీడటం లేదు. చాకిపల్లి, ఎ.ఎస్.కవిటి, రొమదల, రొంపివలస, సీది, కొరసవాడ, తామర, తీమర, గంగువానిపేట, పాతపట్నం సమీపంలో సుమారు రెండు వేల ఎకరాల పంట భూములకు ఆధారమైన గుమ్మగెడ్డ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా గుమ్మగెడ్డను పట్టించుకునే వారే కరువయ్యారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గుమ్మగెడ్డ చానల్‌లో పూడికలు పేరుకుపోయాయి. నీటి ప్రవాహానికి అవరోధంగా ఏర్పడ్డాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధించి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుమ్మగెడ్డ లోతు పెంచి, వెడల్పు చేసి మెరుగుపర్చాలని వారు కోరుతున్నారు.

**రైతులను ఆదుకోవాలి**



వర్షాలు రాక ముందే గుమ్మగెడ్డలో పూడికలు తీయడం, చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేపట్టడం వంటి పనులు చేయాలి. ఖరీఫ్ సీజన్ వచ్చినా ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు ఇంత వరకు పట్టించుకోకపోవడం తగదు.

– బొంగు శ్రీరాములు, రైతు, ఆర్.ఎల్.పురం, పాతపట్నం మండలం

**ప్రతిపాదనలు పంపించాం**

గుమ్మగెడ్డ చానెల్ అభివృద్ధి, చెక్‌డ్యామ్ మరమ్మతుల విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అక్కడి నుంచి అనుమతులు వచ్చాక పనులు చేయిస్తాం.

– జి.వి.రమణ, ఏఈ ఇరిగేషన్, పాతపట్నం మండలం